క్లుప్తంగా

బగలాముఖీ ఆలయంలో న్యాయమూర్తి పూజలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో కొలువైన బగలాముఖీ అమ్మవారిని నర్సాపూర్ కోర్టు న్యాయమూర్తి అనిత శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. సమాజంలో ప్రతీ ఒక్కరు భక్తిమార్గంలో ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా ఆమె అన్నారు.

పోషకాహారంపై అవగాహన



ర్యాలీ చేస్తున్న సూపర్ వైజర్

శివ్వంపేట(నర్సాపూర్): అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న పోషకాహారాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని మండల సూపర్ వైజర్ సంతోష అన్నారు. పోషక మాసం సందర్భంగా శుక్రవారం మండల కేంద్రం శివ్వంపేటలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందుతున్న పోషక ఆహారం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు ఉన్నారు.

నగరంలో మద్యపాన నిషేధం



తీర్మానం చేస్తున్న దృశ్యం

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని నగరం, నగరం తండాలో మద్యపాన నిషేధం విధిస్తున్నట్లు సర్పంచ్ గేమ్‌సింగ్ ఆధ్వర్యంలో తీర్మానం చేశారు. ఈ మేరకు శుక్రవారం గ్రామంలో మద్యం సేవించి గొడవలు పెరిగి పోతుండడంతో గ్రామంలో మద్యపాన నిషేధానికి ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. గ్రామంలో ఎవరైన మద్యం అమ్మిన్నట్లయితే వారికి రూ. 1 లక్ష జరిమానా విధించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గుగ్‌లోత్ రవి లలిత, గ్రామస్తులు పాల్గొన్నారు.


విరాళం



గ్రామస్తులకు నగదును అందిస్తున్న అనిల్ కుమార్

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని అందుగులపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన హనుమాన్ ఆలయంలో విగ్రహాల ఏర్పాటుకు టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గాలి అనిల్ కుమార్ రూ.70 వేలు అందజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మహేశ్‌రెడ్డి, మహేందర్‌గౌడ్, సంజీవరెడ్డి, మల్లేశం గౌడ్, రమేశ్‌గౌడ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

మదన్‌రెడ్డికి టికెట్ ఇవ్వాలని ప్రార్థనలు



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న నాయకులు

నర్సాపూర్: నర్సాపూర్ బీఆర్‌ఎస్ టికెట్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డికే ఇవ్వాలని పలువురు ముస్లింలు శుక్రవారం స్థానిక దర్గాలో ప్రార్థనలు చేశారు. బీఆర్‌ఎస్‌కు చెందిన మైనారిటీ నాయకులు హబీబ్‌కాన్, హైదర్‌బేగ్, రావుఫ్, ఇబ్రహీం, మునీర్, లియాకత్‌అలీ తదితరులు స్థానిక హజ్రత్ షంబుల్ షాహెద్ దర్గాలో ప్రార్థనలు చేశారు.

రాయితో దాడి.. ఒకరిపై కేసు

అల్లాదుర్గం(మెదక్): రాయితో దాడి చేసినందుకు ఒకరిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు అల్లాదుర్గం ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి చెప్పారు. అల్లాదుర్గం గ్రామానికి చెందిన సంతోశ్ టీస్టాల్ నడుపుతున్నారు. అదే గ్రామానికి చెందిన రంగుల శ్రీను టీ ఇవ్వమని అడిగారు. పాత బాకి ఇస్తేనే టీ ఇస్తానని సంతోశ్ చెప్పడంతో ఇరువురి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. సంతోశ్ రాయితో శ్రీను తలపై కొట్టడంతో తీవ్ర గాయాలైనట్లు చికిత్స కోసం జోగిపేట ఆస్పత్రికి పంపినట్లు తెలిపారు. శ్రీను ఫిర్యాదు మేరకు సంతోశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భయం భయంగా బడికి



కూకుట్లపల్లిలో శిథిలావస్థలో పాఠశాల

కురుస్తున్న పాఠశాల భవనం
- కొత్తది నిర్మించినా.. పదేళ్లుగా వినియోగించని వైనం
- కూకుట్లపల్లి ప్రాథమిక పాఠశాల దుస్థితి

కౌడిపల్లి(నర్సాపూర్): వర్షం పడితే పాఠశాల ఉరుస్తుండడంతో విద్యార్థులు కింద కూర్చోని పాఠాలు వినే పరిస్థితి లేదు. పై కప్పు పెచ్చులూడి కింద పడితే విద్యార్థులు గాయపడే అవకాశం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. మరోపక్క నూతనంగా నిర్మించిన భవనాలను పదేళ్లుగా వినియోగించడంలేదు. సర్పంచ్‌లు మారినా, ఎమ్మెల్యే, కలెక్టర్లు ఆదేశించినా.. పాఠశాలను మాత్రం మార్చడం లేదు. దీంతో విద్యార్థులు పాఠశాలకు భయం భయంగా వెళ్తున్నారు. ఇది కౌడిపల్లి మండలం కూకుట్లపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల పరిస్థితి.

ఇబ్బందులు..

కూకుట్లపల్లి గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలకు రెండు గదులు ఉన్నాయి. రోడ్డు అవతల మరో గది ఉంది. ప్రస్తుతం పాఠశాలలో 70 మంది విద్యార్థులు చదువుతున్నారు. హెచ్‌ఎంతో పాటు మరో ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు.

- పాఠశాల గ్రామం నడిబొడ్డున ఉండటంతో ప్రతీరోజు జనం గుమిగూడి రచ్చబండ నిర్వహించడంతో పాటు పంచాయితీలు జరుగుతుంటాయి.దీంతో విద్యార్థులకు ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో చిన్నపాటి వర్షానికే ఉరుస్తుంది. వర్షం వచ్చిందంటే చాలు ఎక్కడ కూర్చుండాలో తెలియని స్థితిలో ఉన్నారు.

పదేళ్లుగా వృథాగా కొత్తభవనం

పాఠశాలలో సరైన సౌకర్యాలు లేకపోవడంతో గ్రామ శివారులో బండపై ఎకరం స్థలం కేటాయించి కొత్త భవనం నిర్మించారు.విడతల వారీగా మొత్తం 6 గదులు నిర్మించారు. కానీ పదేళ్ల గడుస్తున్నా.. వినియోగంలోనికి తీసుకురావడం లేదు. కొత్త భవనంలో కిటికీలు, తలుపులు ధ్వంసం అయ్యాయి. రైతులు వ్యవసాయ సామగ్రిని సైతం అక్కడే పెట్టుకుంటున్నారు. అలాగే అసాంఘీక కార్యక్రమాలకు అది అడ్డాగా మారింది.

- కొత్త భవనంలోనికి మార్చాలని అప్పట్లో కలెక్టర్ ధర్మారెడ్డి, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి సైతం సూచించిన ఎవరు పట్టించుకోవడం లేదు.
- కూకుట్లపల్లి పాఠశాల భవనం మరమ్మతుల కోసం ప్రభుత్వం మన ఊరు – మనబడి ద్వారా రూ. 6 లక్షలు, ఉపాధిహామీ ద్వారా రూ 26. 30లక్షలు మంజూరు చేసి పనులు ప్రారంభించారు. కానీ పాఠశాల కొత్త భవనంలోకి మారుస్తారా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

“ పాఠశాలను మార్చాలి



గ్రామంలో నడిబొడ్డున పాఠశాల ఉండటంతో విద్యార్థులకు సమస్యగా ఉంది. దీనికి తోడు ప్రస్తుతం ఉన్న భవనం శిథిలావస్థకు చేరింది. త్వరగా కొత్త భవనంలోని పాఠశాలను మార్చాలి.
– కొండయ్య, కూకుట్లపల్లి

త్వరలో మారుస్తాం



నూతనంగా నిర్మించిన పాఠశాల భనం గ్రామానికి దూరంగా చెరువు కట్ట సమీపంలో ఉండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఇంతవరకు మార్చలేదు. ప్రహరీ నిర్మాణం కాగానే పాఠశాలను త్వరలోనే మారుస్తాం. – సుజాత, సర్పంచ్ ”

రోగనిర్ధారణ మిషన్‌లో సమస్య

- వారం నుంచి నిలిచిన 40 రకాల పరీక్షలు
- ఇబ్బందులు పడుతున్న రోగులు

మెదక్: జిల్లా కేంద్రం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన రోగ నిర్ధారణ పరీక్షా కేంద్రంలోని(మిషన్)లో ఏదో సమస్య ఉత్పన్నమై వారం రోజులుగా 40 రకాల పరీక్షలు నిలిచి పోయాయి. ఇందులో ప్రధానంగా షుగర్, హెచ్‌బీ, కిడ్నీ రోగులకు చేసే తదితర వ్యాధులకు సంబంధించిన పరీక్షలు చేసేందుకు వీలు లేకుండా పోయింది. ఫలితంగా పేద ప్రజలు ఆస్పత్రికి వస్తే వారిని ప్రైవేట్ ఆస్పత్రులకు పంపిస్తున్నారు. ఈ రోగనిర్ధారణ పరీక్షా కేంద్రంలో 350 రకాల పరీక్షలు నిర్వహించేందుకు వీలు ఉంటుందని, ఇందులో 40 రకాల పరీక్షలు చేసేందుకు వీలు లేకుండా పోయిందని, ల్యాబ్ టెక్నీషన్ ప్రజ్ఞా పేర్కొన్నారు. కాగా ఈ విషయాన్ని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, టెక్నీషన్స్ చెన్నై నుంచి వచ్చి బాగు చేస్తారని తెలిపారు.

ప్లాట్ల క్రమబద్ధీకరణకు అవకాశం: కమిషనర్

నర్సాపూర్: మున్సిపాలిటీ పరిధిలో నోటరీల ద్వారా కొనుగోలు చేసిన ప్లాట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నోటరీల ద్వారా కొనుగోలు చేసిన వ్యవసాయేతర ప్లాట్లను క్రమబద్ధీకరించేందుకు 125 గజాల లోపు ఉంటే ఎటువంటి రుసుము లేకుండా 125 నుంచి మూడు వేల గజాల వరకు ఉంటే ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం స్టాంప్ డ్యూటీ చెల్లించి, ఆస్తులను క్రమబద్ధీకరించుకోవచ్చని చెప్పారు. నవంబర్ ఒకటి వరకు అవకాశం ఉందన్నారు. దరఖాస్తు చేసేందుకు నోటరీ కాగితం, లింకు దస్తావేజులు, ఆస్తి పన్ను, కరెంట్ బిల్లు, నల్లా బిల్లు రసీదులు జత చేసి మీ సేవలో దరఖాస్తు చేయాలని సూచించారు. మరింత సమాచారం కోసం మున్సిపల్ కార్యాలయంలోలని మెనేజర్ మధుసూదన్‌ను 93935 12727 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు.

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠ

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని సదాశివపల్లిలోని ఆంజనేయస్వామి ఆలయంలో నవగ్రహ, ధ్వజస్తంభం, బొడ్రాయి, లింగమయ్య దేవతా విగ్రహాల ప్రతిష్ఠ కోసం శుక్రవారం మొదటి రోజు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. సంగారెడ్డి జిల్లా ఫసల్‌వాదిలోని జ్యోతిర్వాసు విద్యాపీఠం వ్యవస్థాపకుడు బ్రహ్మశ్రీ డాక్టర్ మహేశ్వరశర్మ సిద్దాంతి ఆధ్వర్యంలో గణపతి పూజ, హోమం, విగ్రహాల ఊరేగింపు నిర్వహించారు. సర్పంచ్ శోభనర్సింగారావు, మాజీ సర్పంచ్ వీరయ్య, మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు చెప్యాల రాయగిరితో పాటు గ్రామస్తులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. కంచన్‌పల్లి గ్రామానికి చెందిన దుంపల రాములు అన్నదానం చేశారు.



పూజలు చేస్తున్న పండితులు

పాఠశాలల్లో రక్షాబంధన్



రాఖీలు కట్టుకుంటున్న విద్యార్థులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని చండూర్ ఉన్నత పాఠశాల, జగ్గంపేట నవభారతి పాఠశాలల్లో శుక్రవారం రక్షబంధన్ వేడుకలు జరుపుకున్నారు. విద్యార్థులు నేను నీకు రక్ష, నీవు నాకు రక్ష, మనం దేశానికి రక్ష అంటూ ఒకరికోకరు రాఖీలు కట్టుకున్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మెదక్ మండల వీఓఏలు

హవేళీఘనపూర్(మెదక్): వీఓఏలకు వేతనం పెంచుతున్నట్లు ప్రకటించడంపై మెదక్ మండల వీఓఏల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో మెదక్ మండల వీఓఏల సంఘం అధ్యక్షుడు వెంకట్, కార్యదర్శి శంకర్, కోశాధికారి పోచయ్య, నవనీత, స్రవంతి, సత్యవతి, సుజాత, కవిత, మాధవి, కుమార్, నాగరాజు తదితరులు ఉన్నారు.

సూచనలు అందించండి



మాట్లాడుతున్న నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): ఓటర్ నమోదుతో పాటు ఓటరు జాబితాపై అభ్యంతరాలపై సలహాలు, సూచనలు అందించాలని తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి కోరారు. రాబోయే ఎన్నికల కోసం ఓటర్ జాబితాలో నమోదు, సవరణల కోసం అవకాశం కల్పించినట్లు తెలిపారు. గ్రామాల్లో ప్రతీ ఒక్కరు ఈ అవకాశాన్ని ఉపయోగించుకునేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రమణ, బీజేపీ మండలాధ్యక్షుడు రాజు, బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

స్వచ్ఛందంగా సేవలందిస్తా..

ఎంఎస్‌ఎస్‌ఓ చైర్మన్ మైనంపల్లి రోహిత్



రోహిత్‌ని ఆహ్వానిస్తున్న పాతూర్ గ్రామస్తులు

హవేళీఘనపూర్(మెదక్): పార్టీ పరంగా కాకుండా పేద ప్రజలకు మైనంపల్లి స్వచ్ఛంద సేవా సమితి ఆధ్వర్యంలో సేవలందించేందుకు ఎప్పుడు సిద్ధంగా ఉంటానని స్వచ్ఛంద సంస్థ చైర్మన్ మైనంపల్లి రోహిత్ అన్నారు. శుక్రవారం రాత్రి మెదక్ మండలం పాతూర్ గ్రామానికి చేరుకున్న రోహిత్‌కు ప్రజలు పూలమాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తనకు అధికారం లేనప్పటికీ ఇప్పటికే నియోజకవర్గంలో కోట్లాది రూపాయలు వెచ్చించి స్వచ్ఛందంగా సేవలందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు తనను ఆదరిస్తే ఎమ్మెల్యేగా పోటీ చేసి ప్రజల సమస్యల పరిష్కారంపై ఎప్పుడు సేవలందిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మైనంపల్లి స్వచ్ఛంద సేవా సమితి సభ్యులు పరశురామ్, పాతూర్ గ్రామ యువకులు ఉన్నారు.

సీపీఎస్ విధానం రద్దు చేయాలి



పాపన్నపేట(మెదక్): తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న టీచర్లు

చిలప్‌చెడ్(నర్సాపూర్): సీపీఎస్ విధానం రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని పీఆర్టీయూ సభ్యులు అన్నారు. శుక్రవారం పీఆర్టీయూ రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు సీపీఎస్ రద్దు చేయాలని డిప్యూటీ తహసీల్దార్ సింధూజకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2004 తర్వాత రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో నియమితులైన ఉద్యోగులకు అమలు చేస్తున్న సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల ప్రధాన కార్యదర్శి గురివి నాయుడు, సభ్యులు శర్వాన్, శ్రీనుబాబు, సునీల్, ఆదినారాయణ పాల్గొన్నారు.

అల్లాదుర్గం(మెదక్): పాత పెన్షన్ విధానం అమలు చేయాలని శుక్రవారం అల్లాదుర్గం బాలుర జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీయూపీఎస్ జిల్లా కార్యదర్శి నరేందర్‌గౌడ్ మాట్లాడుతూ.. 2004 నుంచి చేరిన ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం తీసేసి, కొత్త పెన్షన్ విధానం అమలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ధనుంజయ్య, ఉపాధ్యాయులు అశోక్, ప్రవీణ్, హనుమయ్య తదితరులు పాల్గొన్నారు.

పాపన్నపేట(మెదక్): మండల కేంద్రంలో పాత ఫించన్ విధానం పునరుద్దరించాలని తహసీల్దార్ లక్ష్మణ్‌బాబుకు వినతిపత్రం సమర్పించిన వారిలో మండల టీపీఆర్టీయూ అధ్యక్ష, కార్యదర్శులు మాధవారెడ్డి, రాజు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షులు సంతోష్‌కుమార్, చంద్రమోహన్, శ్రీనివాస్‌రెడ్డి, జనార్దన్, మల్లారెడ్డి, గణేశ్, ఫసియొద్దీన్ జయవర్ధన్, సందీప్ పాల్గొన్నారు.

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో జాక్టో ఆధ్వర్యంలో తహసీల్దార్ గ్రేస్‌బాయికి ఉపాధ్యాయులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జాక్టో నాయకులు రామచంద్రాచారి, బి.శ్రీనివాస్, విజయ్‌కుమార్, విఠల్ నాయక్, రామకృష్ణాగౌడ్, ఆనంద్, ఎన్.శ్రీనివాస్, సంగమేశ్వర్, సంతోష్, జనార్దన్, అశోక్‌రెడ్డి, సుధీర్ తదితరులున్నారు.

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో తపస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డికి వినతి పత్రం అందించిన వారిలో తపస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా నాయకులు సతీశ్‌కుమార్, సాయిచందర్, తపస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణమూర్తి, మహేశ్, నాయకులు పాల్గొన్నారు.

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి, మాసాయిపేట మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసిన వారిలో పలు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు నాగిరెడ్డి, సాంబయ్య, నవీన్‌కుమార్, హరి రంజన్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

హవేళీఘనపూర్(మెదక్): మండలంలోని జెడ్పీహెచ్ఎస్ కూచన్‌పల్లి, బూర్గుపల్లి గ్రామాల్లో ఉపాధ్యాయుల డిమాండ్లను పరిష్కరించాలని నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపిన వారిలో ఉపాధ్యాయులు, టీఎస్ పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మల్లారెడ్డి, ఉపాధ్యాయులు లింగం, లక్ష్మీకాంతం, శ్రీనివాస్, వనజాక్షి, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్: కోర్టు తీర్పును అనుసరించి తక్షణమే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని జిల్లా టీఎస్ యూటీఎఫ్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు అన్నారు. శుక్రవారం ఇందిరా పార్కు వేదికగా చేపట్టిన మహా ధర్నాకు నర్సాపూర్ నుంచి వెళ్లిన ఉపాధ్యాయులకు ఉన్నతి శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రవి, మండల శాఖ అధ్యక్షుడు గణేశ్, ఇతర ప్రతినిధులు నాగుల్‌మీరా, రాములు, ముకుందరావు, రాజు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అమరుల స్తూపానికి మట్టి సేకరణ



రామాయంపేట(మెదక్): ఝాన్సిలింగాపూర్‌లో మట్టి సేకరిస్తున్న జనార్దన్‌రెడ్డి, కార్యకర్తలు



హవేళీఘనపూర్: ముత్తాయికోటలో మట్టి సేకరిస్తున్న కార్యకర్తలు

రామాయంపేట(మెదక్): మండలంలోని ఝాన్సిలింగాపూర్‌లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నందు జనార్దన్‌రెడ్డి శుక్రవారం మేరా దేశ్ – మేరా మిట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా ఆయనతో పాటు పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి కలశంలో మట్టి సేకరించారు. ఈ సందర్భంగా జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరూ జాతీయ భావం కలిగి ఉండాలని సూచించారు. ఇందులో భాగంగానే ఇంటింటికీ తిరిగి మట్టి లేదా బియ్యం సేకరిస్తున్నామన్నారు. పార్టీ రామాయంపేట పట్టణాధ్యక్షుడు శంకర్‌గౌడ్, మండల శాఖ కన్వీనర్ దయానందరెడ్డి, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు కాల్వల రాజు, చింటూ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

హవేళీఘనపూర్(మెదక్): మండల పరిధిలోని ముత్తాయికోట గ్రామంలో బీజేపీ నాయకులు ఇళ్ల నుంచి మట్టిని సేకరించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు రంజిత్‌రెడ్డి, శ్రీపాల్, నల్లాల విజయ్, మధుసూదన్, భిక్షపతి, సిద్దిరాములు, శ్రీనివాస్, సత్యం, స్వామి తదితరులు పాల్గొన్నారు.

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి మట్టిని సేకరించిన వారిలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి నందారెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు రాజు, సురేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

పెద్దశంకరంపేట(మెదక్): ప్రతీ గ్రామంలో ప్రతీ ఇంటి నుంచి మట్టిని సేకరిస్తున్నట్లు బీజేపీ మండలాధ్యక్షుడు కోణం విఠల్ శుక్రవారం తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గడ్డం సుధాకర్, నాయకులు దమ్ము సాయిలు, శ్రావణ్‌కుమార్, భూమేశ్, సంగమేశ్వర్, కృష్ణ, నరేశ్, అనిల్ తదితరులున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

మనోహరబాద్(తూప్రాన్): మండలంలోని పలువురు బాధితులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎంపీపీ నవనీత చేతుల మీదుగా అందజేశారు. కాళ్లకల్, జీడిపల్లి, కొండాపూర్ గ్రామాలకు చెందిన బాబు, వెంకటేశ్, నాగమణి, లక్ష్మి, ఫయాజ్, నవనీతలకు ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి చొరవతో మంజూరీ చేయించిన సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను అందిస్తున్నట్లు ఎంపీపీ తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పురం మహేశ్, వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, సర్పంచ్ మమత, సత్యనారాయణ, కుటంరాజు, దాసు, ఉమర్, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న ఎంపీపీ నవనీత

సంక్షిప్త వార్తలు

◆ ఎంపీకి ఆహ్వానం

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలో మహంకాళీ ఉత్సవాలకు హాజరు కావాలని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డికి సర్పంచ్ శ్రీనివాస్ ఆహ్వాన పత్రికను అందించారు. ఈనెల 9 నుంచి 11 వరకు జరిగే విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొనాలని ఎంపీని కోరినట్లు సర్పంచ్ తెలిపారు. ఆహ్వాన పత్రిక అందించిన వారిలో రవి, నాగరాజు, సంతోశ్, రాజేశ్‌లు ఉన్నారు.

◆ ఏడో రోజుకు రిలే దీక్షలు

అల్లాదుర్గం(మెదక్): మండల కేంద్రంలో సివిల్ సబ్ కోర్టు, అల్లాదుర్గంను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని చిల్వెర ఐబీ చౌరస్తాలో రెవెన్యూ సాధన జేఏసీ ఆధ్వర్యంలో చేపడుతున్న రిలే నిరహార దీక్షలు శుక్రవారం ఏడో రోజుకు చేరుకున్నాయి. బహిరన్‌దిబ్బ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు దీక్షలో పాల్గొని నిరసన తెలిపారు. కార్యక్రమంలో పాపయ్య, యాదయ్య, నాగయ్య, అంజయ్య, సంగమేశ్వర్, నర్సింలు, బ్రహ్మం, దుర్గయ్య, శంకరయ్య, బేతయ్య పాల్గొన్నారు.

◆ పనులు ప్రారంభం

హవేళీఘనపూర్(మెదక్): మండలంలోని గాజిరెడ్డిపల్లి రోడ్డు నుంచి తండాకు వెళ్లేందుకు బీటీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం సర్పంచ్ భాగ్య ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు ఉన్నారు.

◆ రోడ్డు సదుపాయం కల్పించండి

రామాయంపేట(మెదక్): మున్సిపాలిటీ పరిధిలోని మల్లె చెరువు కట్ట కింద ఉన్న స్థలంతో పాటు మెదక్ రోడ్డులో ఉన్న శ్మశానవాటికల వద్దకు రోడ్డు సదుపాయం కల్పించాలని ఆర్యవైశ్యులు నిరసన తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వారు గాంధీ విగ్రహం వద్ద నుంచి తహసీల్దార్ కార్యాలయం వద్దకు ర్యాలీ నిర్వహించి వినతిపత్రం అందజేశారు. తాము పట్టాభూమి కొనుగోలు చేయగా, ఆట్టి స్థలంలో కొంతమేర ఫిషరీష్ భవన నిర్మాణానికి రెవెన్యూ శాఖవారు కేటాయించారని వారు ఆరోపించారు. ఈ స్థలాలు కబ్జాకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు.

◆ ఉచిత దయాబెటీస్ పరీక్షలు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలో శుక్రవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత డయాబెటీస్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాలకు చెందిన 19 మందికి రక్త పరీక్షలు నిర్వహించి, రిపోర్టులను అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు అనీల్, బుర్క నాగరాజు, సూర్యప్రకాశ్, వి. నాగరాజు పాల్గొన్నారు.

◆ ఇంటర్ అడ్మిషన్ల గడువు పెంపు

రేగోడ్(మెదక్): మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ అడ్మిషన్ల కోసం ఈనెల 16 వరకు గడువు ఉందని ప్రిన్సిపాల్ జయప్రకాశ్ శుక్రవారం తెలిపారు. పదో తరగతి పాసై ఇంకా ఏ కళాశాలలోనూ చేరని విద్యార్థులు, ఇతర కళాశాలల్లో చేరి కళాశాల మారాలనుకునే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

◆ బీఆర్‌ఎస్‌కు మండల గౌడ సంఘం అధ్యక్షుడి రాజీనామా

కొల్చారం(నర్సాపూర్): గౌడ సంఘం మండలాధ్యక్షుడు, బీఆర్‌ఎస్ పార్టీ మాజీ యువజన అధ్యక్షుడు అప్పాజీపల్లి గ్రామానికి చెందిన నాయని వెంకట్ గౌడ్ (గజిని)బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసినట్లు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

◆ వ్యక్తిగత శుభ్రత పాటించాలి

వెల్దుర్తి(తూప్రాన్): స్వచ్ఛత పక్షోత్సవాల్లో భాగంగా శుక్రవారం వెల్దుర్తి ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించాలని ఈ సందర్భంగా విద్యార్థులకు ఉపాధ్యాయులు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సాంబయ్య, బాలరాజ్, ప్రతాప్‌సింగ్‌రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

◆ క్రీడలు ప్రారంభం

మర్కూక్(గజ్వేల్): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలస్థాయి క్రీడలను శుక్రవారం మర్కూక్ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ ఉదయ్ భాస్కర్‌రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా అండర్ 14, అండర్ 17 మండలస్థాయి ఖోఖో, కబడ్డీ క్రీడాకారులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ భాస్కర్, ఆత్మ డైరెక్టర్ సంతోష్‌రెడ్డి, హెచ్‌ఎం పద్మారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

